# ఆధునిక నీతి కథలు 

## తాళ్లూరు నాగేశ్వరరావు

భువనేశ్వరికి భర్తపోయి ఇప్పటికి అర్ధ దశాబ్దమైంది. అయితే ఈ అయిదేళ్లలో ఆమె అందం అవగింజంత చెక్కుచెదర్లేదు. పైపెచ్చు మబ్బు విడిచిన సంధ్యాకాశంలా మనోజ్ఞంగా మెరవసాగింది. సెకండరీగ్రేడ్ టీచరైన ఆమె భర్త ఆరేళ్ల కొడుకునీ, మూడేళ్ల కూతుర్నీ తప్ప మరో ఆస్తిని మిగల్చకుండా సెరిబ్రల్ హెమరేజ్‌తో హఠాత్తుగా ఈ లోకంనుంచి వెళ్లిపోయాడు. పెద్దకర్మ అయ్యేవరకూ ఆమె కంటికీ భూమికీ ఏకధాటిగా ఏడ్చింది. ఆపైన ధైర్యం తెచ్చుకొని జీవితంపై ఆశలు పెంచుకుంది. స్కూలుఫైనల్ చదివిన విజ్ఞానంతోనే పదిమందికి ట్యూషన్లు చెప్పుకుంటూ పడిపోయిన కొంపతో కాలక్షేపం చేయసాగింది. ఒక్క సంవత్సరంలో ట్యూషన్ చదివేవాళ్ల సంఖ్య పాతికదాకా చేరుకుంది. రెండో సంవత్సరంలో ఆ సంఖ్య అయిదు పదుల్ని మించింది. తనకి బంగారు భవిష్యత్తు వుందని భువనేశ్వరి భావించింది. అయిదేళ్లలో ఆమె భావన నిజమైంది. అరవైమంది విద్యార్థులతో గ్రీన్‌వుడ్స్ కిండర్‌గార్టెన్ స్కూలు ప్రారంభించింది. దానికి ఆ వూరి సర్పంచ్, పంచాయతీసమితి ప్రెసిడెంట్ ఆర్థిక బలాన్ని చేకూర్చారు; ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టరు నైతిక బలాన్ని సమకూర్చాడు.

ఒకసారి ఉన్నత పాఠశాల నూతన భవనాల శంఖుస్థాపనకు ఆ గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సాయంత్రం ఆరుగంటలకు వచ్చాడు. ఆ ఉత్సవాన్ని ఆడంబరంగా, అమితమైన వ్యయంతో, గ్రామ పరువు ప్రతిష్టలు ఇనుమడించే విధంగా, తన రాజకీయ భవిష్యత్తుకు చక్కని బాటగా ఆ వూరి ప్రెసిడెంట్ ఏర్పాటు చేశాడు. ఆ ఉత్సవానికి భువనేశ్వరి వచ్చింది– నల్లంచు తెల్లని ఆర్గండీ చీర ధరించి. ఆ చీరలో ఆమె అందం అమోఘంగా, అత్యంతాకర్షకంగా వుంది. మీటింగ్‌కు వచ్చినవాళ్ల కళ్లన్నీ ఆమె మీదనే వాలాయి. అందులో ఏమంత అబ్బురం లేదుగానీ, గంభీరోపన్యాసం యిస్తూన్న ముఖ్యమంత్రి వాడి చూపులు హఠాత్తుగా ఆమెమీద పడ్డాయి. ఆయన మనస్సు చెదిరింది; ఆరు పదులు దాటిన వయస్సు ముసలెద్దులా వలపు వాసనతో రంకె వేసింది; కొవ్వొత్తి దీపంలా కోర్కె కాలుదువ్వింది. చూపు పట్టుదప్పటంతో, ఆలో

చనలు కట్టుతీడటంతో, మాటలు జారుకుమెట్లయ్యాయి. గొంతు గురగుర లాడింది. ఆపైన మూడు నిముషాల్లో పంచరుపడ్డ లారీ పైరులా ఉపన్యాసాన్ని ముగించాడు. మీటింగ్ అయినాక ఆ వూరి ప్రెసిడెంట్‌ను వాకబు చేశాడు– నల్లంచు తెల్లచీరలో నిగనిగలాడే సౌందర్యాన్ని నిక్షిప్తపర్చుకున్న భువనేశ్వరి గురించి.

ఆ రాత్రి ఏడున్నర గంటలకు భువనేశ్వరికి కబురొచ్చింది– ముఖ్య మంత్రిగారు మాట్లాడటానికి ఉబలాటపడుతూన్నట్టు. అదృష్టం ఆగమేఘాలమీద కాళ్ళముందు వచ్చిపడ్డట్టుగా అత్యద్భుతంగా ఆశ్చర్యపడి, బంగారానికి మెరుగు పెట్టినట్టుగా మరింత అలంకరించుకొని, ముఖ్యమంత్రి సమక్షంలోకి వెళ్ళి, ముకుళిత నేత్రమై నమస్కరించింది. అంతే!

కారెక్కమని కనుసైగ చేశాడు ముఖ్యమంత్రి.

రాజకీయంగా రాజధానీ నగరంలో రాణీవాసం వెలిగిద్దామనుకున్న ఆ రమణి మాట్లాడకుండా కారెక్కింది.

మూడు నెలల్లో భువనేశ్వరికి అమాంతంగా మంత్రిపదవి లభించింది. ఆమె అదృష్టాన్ని చాలమంది ఆకాశంతో పోల్చారు. అందమైన ఆడది శీలం అంత ముఖ్యం కాదనుకొంటే ఏ రంగంలోనైనా రమణీయంగా రాణించవచ్చు ననేది కొత్త విషయమేమీ కాదు అనుకున్నారు కొంతమంది.

అయితే ఆడదాని అదృష్టం ఎంత చంచలమో రాజకీయాలు అంతకంటే ఆరురెట్లు అనూహ్యమైన మార్పులకు ఆటపట్టయినవి.

ఒక కారు యాక్సిడెంట్‌లో ఆ ముఖ్యమంత్రిగారు శాశ్వతంగా కీర్తి శేషులయ్యారు.

రాష్ట్ర రాజకీయాలు తల్లకిందులై, అధిష్ఠానవర్గం ఆశీస్సులతో, ఆమోద ముద్రతో ఓ అడ్రసులేని ఎం.ఎల్.ఏ. అదృష్టదేవత ఆలింగనంలోకి వచ్చి, ముఖ్యమంత్రి అయ్యాడు. కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది. అందులో భువనేశ్వరి లేకపోవడం ఎవ్వరికీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు.

అయితే భువనేశ్వరి నిరాశతో నిట్టూర్చిన నిప్పురవ్వ అయిపోయి స్వగ్రామం తిరిగిరాలేదు. రాజధాని నగరంలోనే ఓ ఎం.ఎల్.ఏ. క్వార్టర్సు అద్దెకు తీసుకొని కనీసం ఎం.ఎల్.సి. అయినా అవుదామనే ఆకుపచ్చని ఆశతో రాజకీయ నాయకుల్ని తన ఆకర్షణ వృత్తంలోకి లాక్కోవడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోంది.

***అరిషడీయ భోగంలాంటి రాజకీయ పదవికోసం అమూల్యమైన శీలాన్ని అంగట్లో పెట్టడం అవివేకం.***